శంభో మహాదేవ

## జాతకాలు - జీవితాలు

# శుక్ర, కుజ అర్ధప్రహార ఉపగ్రహాల ఫలితాల వలన ఇలాంటివి జరుగుతాయి

అది 1995వ సంవత్సరం. రామచంద్రమూర్తి అనే పోలీస్ ఆఫీసర్ నా దగ్గరకు రావడం జరిగింది. వాళ్ళమ్మాయి గీతాంజలి జాతకం చూపించాడు. దాంతో పాటు మధుబాబు అనే అబ్బాయి జాతకం కూడా చూపించాడు. వీళ్ళిద్దరికి పెళ్ళిచేయాలని అనుకుంటున్నాము, మీరు ముహూర్తం పెట్టాలి, మా వాళ్ళందరికి మీరంటే బాగా నమ్మకం అన్నాడు. నేను జాతకాలు పరిశీలించి ఒకటే చెప్పాను. ఇద్దరి జాతకాలు కలువలేదు. అమ్మాయి జాతకంలో గురు మహర్దశ నడుస్తోంది, గురువు రాహువుతో కలిసి ఉన్నాడు, పైగా శత్రుక్షేత్రంలో ఉన్నాడు. దీనినే గురుచండాల యోగం అంటారు. అమ్మాయికి వివాహపరంగా దోషం ఉంది. అబ్బాయి జాతకంలో సర్పదోషం ఉంది. ప్రతికూలమైన కేతు మహర్దశ నడుస్తుంది, ఆయుర్భావం కూడా అంత గట్టిగా లేదు. మీ అమ్మాయిని ఇతనికిచ్చి పెళ్ళి చేసి, అమ్మాయి జీవితం నాశనం చేయకండి. ఒక్క సంవత్సరం ఆరు నెలలు ఓపిక పట్టండి. అప్పుడు అమ్మాయికి మంచి దశ వస్తుంది. ఈలోపు శాంతిక్రతువులు కూడా పూర్తి చేయవచ్చు అని చెప్పాను. ఇప్పటికే మేము మాట ఇచ్చియున్నాము. ఇద్దరికీ నిశ్చితార్థం కూడా జరిగిపోయింది. పెళ్ళి ఆపడానికి అవకాశం లేదు. మీరేదైనా ముహూర్తం పెడితే సంతోషిస్తాను అని అన్నాడు. అయ్యా ముహూర్తాలు కూడా నేనే పెడితే మిగతా వాళ్ళు బ్రతికేదెట్ల ? స్థానిక పండితులే ముహూర్తాలు పెట్టాలి. నేనెవరికీ ముహూర్తాలు పెట్టలేదు, మీకు కూడా ముహూర్తం ఇవ్వలేను. ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులకు తప్ప ఇతరత్ర విషయాలకు నేను ముహూర్తాలు పెట్టను అన్నాను. గీతాంజలికి, మధుబాబుకి పెళ్ళి ఘనంగా చేశారు. భార్యాభర్తలిద్దరూ అన్యోన్యంగా ఉంటున్నారు. అమ్మాయి బాగోగులు కూడా మధుబాబు జాగ్రత్తగా చూసుకునేవాడు. డబ్బులకు ఏమీ కొదవలేదు. మధుబాబు మంచి ఉద్యోగంలో ఉన్నాడు. ఒక సంవత్సరం గడిచింది. తరువాత రెండవ సంవత్సరం కూడా గడిచింది. పెళ్ళి చేసుకుని రెండేళ్ళైనా పిల్లలు పుట్టలేదు. పెద్దవాళ్ళు ఆలోచించారు, వాళ్ళిద్దరూ కూడా కొన్నాళ్ళపాటు పిల్లలు వద్దనుకున్నారేమో అని భావించారు. పిల్లలు కలగాల్సిందే అని పెద్దవాళ్ళు ఒత్తిడి తెచ్చారు. మాకు కూడా ముచ్చట్లు ఉంటాయి కదా మనవడినో, మనవరాలినో ఎత్తుకోవాలని, ఆడించాలని మేము అనుకుంటాము కదా, రెండేళ్ళైనా ఇంకా పిల్లలు కలుగకపోవడమేమిటి ? అని భార్యాభర్తలిద్దరికీ చెప్పారు పెద్దవాళ్ళు. గీతాంజలి వాళ్ళ అమ్మ అనసూయమ్మ గారు ప్రతిరోజు పిల్లలకోసం ఒత్తిడిపెట్టేది. డాక్టర్‌ని కూడా సంప్రదించి, అమ్మాయిలో ఏమైనా లోపం ఉందేమోనని అనుకున్నారు. అమ్మాయికి సంబంధించి అన్ని విధాలుగా బాగుంది, సంతానం కలుగకుండా ఉండడానికి ఎలాంటి ఇబ్బందులు లేవు, ఈమె ఆరోగ్యం అన్ని విధాలుగా బాగుంది. అబ్బాయి ఆరోగ్యంలో ఏమైనా ఇబ్బందులున్నాయేమో ? అని డాక్టర్ తన అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు. గీతాంజలి వాళ్ళ అమ్మ అనసూయమ్మగారు అమ్మాయిని బ్రతిమిలాడి పిల్లలు పుట్టకపోవడానికి కారణం ఏమిటమ్మా ? నువ్వు నాకు గాక మరెవరికి చెప్పుకుంటావు ? నిజం చెప్పు అని అన్యోన్యంగా

www.mulugu.com చూడండి. ప్రతిరోజు ఉ॥ 8 గం॥లకు స్టార్ మా టీవీలో రాశిఫలాలు కార్యక్రమం తప్పక చూడండి, కొన్ని విలువైన విషయాలు తెలుస్తాయి.

అడిగింది. గీతాంజలి ఒక్కసారిగా బోరుమని ఏడ్చింది, వాళ్ళమ్మను కౌగిలించుకుని చాలాసేపు ఏడ్చింది. బాధపడకమ్మా ఇప్పటికైనా నిజం చెప్పు అని గీతాంజలిని సముదాయించింది వాళ్ళ అమ్మగారు. గీతాంజలి చెప్పింది ఆయన పిల్లలు పుట్టే విధంగా సంసారం చేయడం లేదు. నాతో దూరం దూరంగా ఉంటున్నాడు. కారణం ఏమిటో నాకు తెలియదు అని ఉన్న విషయం చెప్పింది. అనసూయమ్మగారు తన భర్త రామచంద్రమూర్తికి విషయమంతా చెప్పింది. ఎంతైనా పోలీస్ ఆఫీసర్ కదా బాగా ఆలోచించాడు. అమ్మాయికి వైద్యపరీక్షలు చేసిన విధంగానే అబ్బాయికి కూడా (అల్లుడికి) వైద్య పరీక్షలు చేయించాలి అని నిర్ణయించుకున్నాడు. ఇదే విషయం వాళ్ళ అమ్మానాన్నకు కూడా చెప్పాడు. వైద్య పరీక్షలంటే రానంటే రానన్నాడు మధుబాబు. రామచంద్రమూర్తి గారికి అనుమానం మరింత ఎక్కువైంది. ఓ రోజు బలవంతంగా నలుగురి డి.ఎస్.పి.లు, పదిమంది సి.ఐ.లు, పోలీసుల మందీమార్బలంతో మధుబాబుని బలవంతంగా హాస్పటల్‌కి తీసుకెళ్ళి వైద్యపరీక్షలు చేయించారు. ఆ వైద్యపరీక్షల్లో ఇతనికి 'ఎయిడ్స్' ఉందని తేలింది. రామచంద్రమూర్తి గారు అల్లుడిని చావచితకతన్నారు. మ్యూచ్‌వల్ డైవర్స్ కోసం అప్లై చేశారు. నష్టపరిహారం కింద కోటిరూపాయలు తీసుకున్నారు. పెళ్ళి ఖర్చులు పెట్టినందుకు మరో 15 లక్షలు తీసుకున్నారు. విడాకులు వచ్చేశాయి. ఈ అమ్మాయికి మంచి సంబంధం కుదిరింది. అలా పెళ్ళి చేసుకున్న గీతాంజలి అమెరికా వెళ్ళిపోయింది. మధుబాబు సుమారు ఆరు నెలల తరువాత మరణించాడు. ఏదిఏమైనా ప్రతివిషయంలోనూ గ్రహగతులు పరిశీలించి, నిష్ణాతులైన సిద్ధాంతుల దగ్గర జ్యోతిష్యశాస్త్ర సలహాలు తీసుకుంటే మేలు జరిగే అవకాశం ఉంది.

## చంద్ర, శుక్రుడు జాతకంలో అనుకూలంగా ఉంటే ఇలాంటి సంఘటనలు జరుగుతాయి.

అది 1985వ సంవత్సరం. నేను కాశీ వెళ్ళాను. అక్కడ నాగేంద్ర చతుర్వేది అనే అబ్బాయి పరిచయమయ్యాడు. అతను చాలా పేద బ్రాహ్మణుడు. అతని చిన్నప్పుడే తల్లిదండ్రులు ఇద్దరూ పోయారు, అనాథ. వాళ్ళ బాబాయి వాళ్ళ ఇంట్లో ఓ చిన్నగదిలో ఉండేవాడు. వాళ్ళ బాబాయి వాళ్ళు చెప్పారు మేము భోజనాలు పెట్టం, ఆర్థిక సాయం చేయలేము. తల్లిదండ్రి లేని అనాథవు కనుక ఉండటానికి గది ఇస్తున్నాము. నాగేంద్ర చతుర్వేది చిన్నచిన్న పూజలు, జపాలు చేసేవాడు. శుక్రవారం షాపుల్లో లక్ష్మీదేవి పూజ చేసి కడుపునింపుకుంటూ ఉండేవాడు. మధ్యమధ్యలో శవాలు మోయడం కూడా చేసేవాడు. ఉన్నరోజున తినేవాడు, లేనిరోజున పస్తులుండేవాడు. నాతో కాస్త చనువు ఏర్పడ్డాక తన జాతకం చూపించి, తన బాధలన్నీ చెప్పాడు. నేను జాతకం పరిశీలించి చెప్పాను. జీవితంలో మంచి ఉన్నతస్థాయికి ఎదుగుతావు, నీ భార్య జాతకం వల్ల నువ్వు అదృష్టాన్ని పొందగలుగుతావు. ఎందుకంటే నీ జాతకంలో కళత్రకారకుడైన శుక్రుడు ఉచ్ఛస్థితిలో ఉన్నాడు. సప్తమాధిపతి అంటే వివాహసంబంధిత స్థానాధిపతి శుభగ్రహ దృష్టి కలిగి ఉన్నాడు. కాబట్టి వివాహం అయ్యే వరకు కాస్త ఓపిక పట్టు అని చెప్పాను. నాకే తిండికి లేక అడుక్కు తింటుంటే నాకు పెళ్ళేమిటి ? పిల్లనెవరు ఇస్తారు? అన్నాడు నిరాశగా. నేను విని ఊరుకున్నాను ఏమీ మాట్లాడలేదు. నీకేదైనా పని పడితే నాకు ఫోన్ చెయ్యి అని నా విజిటింగ్ కార్డ్ ఇచ్చి వచ్చాను. ఆ ఊళ్ళోనే శకుంతలమ్మ అనే ఆవిడ

వంటలు చేసుకుంటూ జీవనం కొనసాగించేది. ఆమెకు ఒకే ఒక కుమార్తె, పేరు లత. తల్లి వంటలకు వెళ్ళినప్పుడు లత కూడా సాయంగా వెళ్ళేది. వాళ్ళకి మగదిక్కు లేదు. ఓ రోజు ఎవరిదో పెళ్ళి జరుగుతుంటే అక్కడ ఇద్దరూ కలిశారు. శకుంతలమ్మ వంటలు చేయడానికి, నాగేంద్ర చతుర్వేది పెళ్ళి చేయడానికి ఆ విధంగా వాళ్ళు అక్కడ కలవడం జరిగింది. ఆ మాట ఈ మాట మాట్లాడుకున్నారు. మాటల సందర్భంలో తను అనాథనని చెప్పి తన జీవనం గురించి కూడా చెప్పాడు. దాంతో శకుంతలమ్మ మా అమ్మాయి లతను పెళ్ళి చేసుకో ముగ్గురం కలిసి కష్టపడితే పొట్ట గడుస్తుంది అని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. కనీసం లతను చూడకుండా చేసుకుంటానని చెప్పేశాడు శకుంతలమ్మకు. గుళ్ళో దండలు మార్చుకున్నారు, తాళిబొట్టు కట్టాడు, కాశీవిశ్వేశ్వరున్ని, అన్నపూర్ణదేవిని దర్శనం చేసుకున్నారు. ఇలా కొంతకాలం గడిచింది. మూఢమి వల్ల పెళ్ళిళ్ళు, శుభకార్యాలు లేక ఇబ్బంది పడుతున్నారు. నాగేంద్ర చతుర్వేదికి ఒక ఆలోచన వచ్చింది. భార్యకు చెప్పాడు. భార్య కూడా సరే అన్నది. ఇదే విషయాన్ని శకుంతలమ్మకు చెప్పారు. అందరూ ఒక నిర్ణయానికి వచ్చి అప్పడాలు, వడియాలు ఇంట్లో తయారుచేయటం, వాటిని షాపులకి పంపించడం, ఇంటి ముందు ఓ బల్ల, కుర్చీ వేసుకుని అప్పడాలు, వడియాలు అమ్ముతున్నారు. ఒక నెల పదిహేను రోజుల్లో అప్పడాలు, వడియాలు బ్రహ్మాండంగా ఉన్నాయని ప్రజలు ఆకర్షితులయ్యారు. వీళ్ళు కూడా ఇంటి పక్కనే ఉన్న ఓ చిన్న పోర్షన్‌ని అద్దెకు తీసుకుని ఈ అప్పడాలు, వడియాలు చుట్టు ప్రక్కల పట్టణాలకు సప్లై చేసేవాళ్ళు. దివారాత్రులు కష్టపడి అప్పడాలు వడియాలు మంచి రుచిగా ఉండే విధంగా ఎక్కడా రాజీపడకుండా చేసేవాళ్ళు. రోజురోజుకి వ్యాపారం పెరుగుతుంది. ఎవరైనా ఏదైనా గిఫ్ట్ ఇవ్వాలంటే ఈ అప్పడాల, వడియాల ప్యాకెట్లు గిఫ్టుగా ఇచ్చేవారు. జీవనం జరిగిపోతుంది, డబ్బులు కూడా బాగా కూడబెట్టారు. ఈ విషయమంతా టెలిఫోన్‌లో నాకు చెప్పాడు. నాగేంద్ర చతుర్వేదికి మరొక ఆలోచన వచ్చింది. భార్య లతకు చెప్పాడు. నీ పేరు మీద వ్యాపారం చేయబోతున్నాను అని. ఏమిటా వ్యాపారం ? అంది లత. స్వీట్స్ వ్యాపారం. లడ్లు, మైసూర్ పాక్‌లు, పప్పుండలు, జిలేబి, అరిసెలు, పీచుమిఠాయి, పాలకోవా, కజ్జికాయలు, పచ్చళ్ళు, కారపూస, జీడిపప్పు పాకం ఇవన్నీ తయారు చేసి అమ్మితే బాగుంటుంది, భార్య, అత్తగారు సరే అన్నారు. స్వీట్ల వ్యాపారం మూడు నెలల తరువాత బ్రహ్మాండంగా పుంజుకుంది. చుట్టు ప్రక్కల పట్టణాలు, ఇతర రాష్ట్రంలో ఉన్న షాపులు అందరూ ఈ స్వీట్స్‌ని మెచ్చుకున్నారు. లత స్వీట్స్‌కి ఎదురులేకుండా పోయింది. ఎంత సప్లై చేసినా సరిపోవడం లేదు. అక్కడ ఓ ఇల్లు కొనుక్కొని ఇరువై మంది పనివాళ్ళను పెట్టి స్వీట్స్, అప్పడాలు, వడియాల వ్యాపారం నడుపుతున్నారు. ఆ స్వీట్స్, పచ్చళ్ళకి విదేశాల నుండి కూడా ఆర్డర్స్ వచ్చేవి. విదేశాలకు వెళ్ళేవాళ్ళు ఇక్కడ అన్నీ కొనుక్కొని, అక్కడి వాళ్ళకు ఇచ్చేవాళ్ళు. వ్యాపారం అనూహ్యంగా పెరిగిపోయింది. లత స్వీట్స్ అంటే ఒక గొప్ప బ్రాండ్‌నేమ్‌గా ప్రజలలో ముద్రపడింది. వ్యాపారం కోట్లు దాటిపోయింది. నా దగ్గరకు వచ్చి విషయమంతా చెప్పాడు. వాళ్ళ స్వీట్స్ కూడా ఇచ్చాడు. నా జీవితం ఇలా మారిపోవటం చాలా సంతోషంగా ఉంది. మీరు చెప్పినట్లుగానే పెళ్ళైన తరువాత ఈ పరిస్థితి వచ్చింది అన్నాడు. నేను ఒకటే మాట అన్నాను గ్రహాలు ఎప్పుడూ అబద్ధం చెప్పవు. నీ విషయంలోనూ అదే జరిగింది.

## గురుగ్రహ ప్రభావం వలన ఇలాంటి సంఘటనలు జరుగుతాయి

జాతకంలో దైవానుగ్రహం ఉన్నదీ, లేనిది గ్రహగతులను అనుసరించి తెలుస్తుంది. ముఖ్యంగా గురుగ్రహ స్థితిని బట్టి ఈ భగవత్ అనుగ్రహప్రాప్తి తెలుస్తుంది. జాతకంలో గురువు అనుకూలంగా ఉంటే బలవన్ బ్రాహ్మణ ఆశీర్వాదం, వైష్ణవ దేవత అనుగ్రహం కలుగుతుంది. గురుగ్రహ పరిస్థితి బాగాలేనప్పుడు బలవన్ బ్రాహ్మణ స్పర్థ, వైష్ణవ దేవత ఆగ్రహం సంభవంతు నిస్సంశయ:. వెంకటలక్ష్మి మంచి గాయని. శాస్త్రీయ సంగీతాన్ని కష్టపడి నేర్చుకుంది. వెంకటలక్ష్మి శ్రీవేంకటేశ్వర స్వామి భక్తురాలు. ఆమె భక్తి వర్ణణాతీతం. వాళ్ళ నాన్నగారు సదాశివ శాస్త్రి గారు. ఆయన ప్రముఖ సంగీత విద్వాంసుడు శ్రీ అన్నమాచార్య సంగీత కళాశాల స్థాపించి అందరికీ ఉచితంగా సంగీత పాఠాలు చెప్పేవారు. గాయనిగా వెంకటలక్ష్మికి రాష్ట్రవ్యాప్తంగా మంచి పేరు వచ్చింది. వెంకటలక్ష్మి కచేరి అంటే జనం తండోపతండాలుగా వచ్చేవారు. ఎన్నో సత్కారాలు, సన్మానాలు, అవార్డులు, బిరుదులు ఈమెను వరించాయి. సినిమాలో పాటలు పాడటానికి ఎన్నో అవకాశాలు వచ్చినా సంగీతానికి పూర్తి న్యాయం చేయలేనని సినిమా అవకాశాలు త్రోసిపెట్టింది. నా సంగీతం, గాత్రం, శరీరం, శక్తి, నా ప్రాణం అంతా శ్రీవేంకటేశ్వరస్వామి. వారికే అర్పితం అని భావించింది. ఆమె చాలా నిగర్వి. ఆమెకు గురుమహర్దశ నడుస్తోంది. నేషనల్ సంగీత అకాడమి ఆధ్వర్యంలో అన్నమాచార్య పాటల పోటీలు ప్రకటించారు. సెలక్షన్ కమిటీ దేశవ్యాప్తంగా పదిమంది గాయనీ గాయకులను ఎంపిక చేసింది. వాళ్ళలో వెంకటలక్ష్మి కూడా ఎంపిక అయ్యింది. వెంకటలక్ష్మి నా దగ్గరకు వచ్చి అన్నా ! జాతీయస్థాయిలో పోటీలు, నాకు ఫస్ట్ ప్రైజ్ వస్తుందా ? రాదా ? అని అడిగింది. నీకు కాకపోతే ఇంకెవరికి వస్తుంది, నీకే వస్తుంది అని అన్నాను. అలా కాదన్నయ్య నువ్వు జాతకం చూసి చెప్తే నాకు సంతృప్తిగా ఉంటుంది. వెంటనే జాతకం పరిశీలించాను. గురుమహర్దశలో శని అంతర్దశ నడుస్తోంది. గురువు ఉచ్ఛస్థితిలో ఉన్నాడు. శని యోగకారక స్థితిలో ఉన్నాడు. నీకేం దిగులు లేదమ్మా, దైవానుగ్రహం నీకు సంపూర్ణంగా ఉంది, విజయం నీదే, ధైర్యంగా ఉండు అన్నాను. ఫైనల్ పోటీల తేది ఖరారైంది. న్యూఢిల్లీలో కర్ణాటక భవన్ ఆడిటోరియంలో పోటీలు జరుగుతాయని ప్రకటించారు. పోటీలు వారం రోజులలో ఉన్నాయి అనగా వెంకటలక్ష్మికి జ్వరం–త్రోట్ ఇన్ఫెక్షన్ వచ్చింది. మందులు వాడారు, జ్వరం తగ్గింది. త్రోట్ ఇన్ఫెక్షన్ తగ్గలేదు. ప్రాక్టీస్ చేయడానికి కూడా గొంతు సహకరించడం లేదు. ఢిల్లీ వెళ్ళను అంది. అన్నింటికీ స్వామియే ఉన్నాడమ్మా, పోదాం పద అని తండ్రి సదాశివ శాస్త్రి ఢిల్లీ తీసుకుని వెళ్లాడు. పోటీలు బ్రహ్మాండంగా ప్రారంభమయ్యాయి. ముందు వరుసలో ముఖ్య అతిథి – రాష్ట్రపతి, ప్రధానమంత్రి, అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, అన్ని రాష్ట్రాల గవర్నర్‌లు ఆశీనులై ఉన్నారు. సెలక్ట్ అయిన 10 మంది గాయనీ గాయకుల్లో ఈమెది 7వ స్థానం. వేదిక మీదకు పిలిచారు. దుఃఖాన్ని దిగమింగుకుని వేదికమీదకు వెళ్ళింది వెంకటలక్ష్మి – అందరికీ నమస్కరించి పాట ప్రారంభించింది. విపరీతమైన గొంతు నొప్పి – అయినా పాడుతూనే ఉంది. తనగొంతు, పాడుతున్న తీరు వెంకటలక్ష్మికి అస్సలు నచ్చలేదు. పక్కన ఉన్న వాయిద్యకారులు – ఇంత ఘోరంగా పాడుతుందేమిటి ? ఈమె గురించి చాలా గొప్పగా విన్నామే ? అని ఆశ్చర్యపోయారు. శృతి లేదు, లయ లేదు, అపస్వరాలు, బొంగురు గొంతుతో ఏమి పాడుతుందో వాళ్ళకు అర్థం కాలేదు. వెంకటలక్ష్మి పాడిన పాట వేదిక మీద ఘోరంగా

ఉంది. కానీ ఎదురుగా ఉన్న ప్రేక్షకులకు సమ్మోహనాస్త్రంలా ఉంది. గంధర్వ గానంలా ఉంది. ఈ కార్యక్రమానికి కో–ఆర్డినేటర్, కల్చర్ ఎఫైర్స్ సెక్రెటరీ, హ్యూమన్ రిసోర్సెస్ డిపార్ట్‌మెంట్ డిప్యూటి సెక్రెటరీ, ఛటోపాధ్యాయ వేదిక మీద ఈ పాటను విని తలబాదుకున్నాడు. తరువాత పాడవలసిన క్యాండిడేట్ మోహన్‌చంద్రను రెడీ చేయడానికి స్టేజీ దిగి జనంలోకి వచ్చాడు. ఆయనకు మతిపోయినంత పనైంది. వెంకటలక్ష్మి గాత్రం అద్భుతంగా వినవస్తుంది, ఆమె పాడుతున్న అన్నమాచార్య కీర్తన ఆడిటోరియం దశదిశలా సంగీత మాధుర్యాన్ని వెదజల్లుతుంది– ఛటోపాధ్యాయకు ఎందుకో సందేహం వచ్చి వేదిక మీదకు వెళ్లాడు. కర్ణకఠోరంగా పాడుతుంది వెంకటలక్ష్మి. మళ్ళీ స్టేజీ దిగి జనంలో నిలబడి పాట విన్నాడు, అపర సరస్వతీదేవి పాడుతున్నట్లు అనిపించింది. ప్రేక్షకులు సమ్మోహితులైనారు. రాష్ట్రపతితో సహా అందరూ లేచి నిలబడి చప్పట్లు కొడుతున్నారు. అలా పదినిమిషాలపాటు చప్పట్లు ఆడిటోరియంలో మారుమ్రోగుతూనే ఉన్నాయి.

నిర్వాహకులు అందరి పాటలు రికార్డు చేశారు. జడ్జీలు “విన్నర్‌ని ప్రకటించడానికి ముందు రికార్డు చేసిన అందరి పాటలు విని అంతిమ నిర్ణయానికి వస్తారు. ఆ క్రమంలోనే రికార్డైన వెంకటలక్ష్మి పాట ఎలా ఉందోనని కల్చరల్ సెక్రెటరీ ఛటోపాధ్యాయ జడ్జీల దగ్గరకు వెళ్ళి వెంకటలక్ష్మి పాట వినిపించమని అడిగాడు. పాట కోకిల కంఠంలా ఉంది. చెవిలో తేనె పోసినట్లు అనిపించింది. ఫస్ట్ ప్రైజ్ విన్నర్ వెంకటలక్ష్మి అని అందరూ ఏకగ్రీవంగా తీర్మానించారు. రాష్ట్రపతి చేతులమీదుగా ప్రథమ బహుమతి అందుకుంది వెంకటలక్ష్మి. ఛటోపాధ్యాయ, వాయిద్యకారులు అంటే వాళ్ళేమి సామాన్యమైన వారు కాదు దేశవ్యాప్తంగా పేరుగాంచిన వాళ్ళు. వాళ్ళు దిగ్భ్రాంతికి గురయ్యారు. అసలు వాళ్ళకు ఏం జరుగుతుందో అర్థంకాలేదు – అర్థంకాదు కూడా ! అంతా మాయగా అనిపించింది. జగమంతా విష్ణుమాయలోనే ఉంది. ఈ మాయ ఆయనకు చాలా చిన్నపని !! ఓం నమోవేంకటేశాయ !! నీవు అఘటనా ఘటన సముద్రుడవని ఊరికే మహర్షులు ప్రశంసించలేదు స్వామి, నీవు దేనికైనా సమర్థుడవు, నీ పాదారవిందాలకు శతకోటి నమస్కారాలు స్వామి.

## చంద్రగ్రహం - పరివేష్ అను ఉపగ్రహం ఇచ్చే ఫలితాలు

స్మశానం దగ్గరగా నివాసం ఉండకూడదని కొంతమంది శాస్త్రకారుల అభిప్రాయం. చంద్రగ్రహం, పరివేష్ అను ఉపగ్రహం జాతకంలో బాగాలేకపోవడం వల్ల గాలి, ధూళి, నరదృష్టి, ఆత్మలు ఆవహించడం జరుగుతుంది. ఆత్మలు ఉన్నాయని కొందరు, లేవని కొందరు అంటుంటారు. వాటి గురించి నేను ఎలాంటి వ్యాఖ్యానాలు చేయను. జ్యోతిష్యశాస్త్రపరంగానే నా విశ్లేషణను తెలియజేస్తున్నాను. ఇప్పుడు చెప్తున్నది ఒక యథార్థ సంఘటన.

రామసుబ్బారావు – గాయత్రి దంపతులకు శ్యామలాదేవి అనే కూతురు ఉండేది. ఆమెకు శని మహర్దశ నడుస్తోంది. ఇది చాలాకాలం క్రితం జరిగిన సంఘటన. ఉన్నట్టుండి శ్యామలాదేవి ప్రవర్తనలో మార్పువచ్చింది. తల్లి, తండ్రి, చుట్టుప్రక్కలవాళ్ళను చావగొట్టేది. ప్రముఖ మానసిక వైద్యుడు డా॥ శంకర్‌రావు కొత్తపేట, గుంటూరు. ఆయన శ్యామలాదేవికి ట్రీట్‌మెంట్ చేశారు, మందులు ఇచ్చారు, అందువల్ల ఎలాంటి ప్రయోజనం కలుగలేదు. చివరకు దెయ్యం పట్టిందని అందరూ నిర్ణయించారు. శ్యామలాదేవి నలుగురు మనుషులు తినే అన్నం తినేది. అర్థరాత్రి బావిదగ్గర స్నానం చేసి, పెరట్లో తులసి కోట దగ్గర కూర్చొని

మంత్రాలు చదువుతూ, తెల్లవారు జామున మూడు గంటలకు పూజ పూర్తి చేసి పడిపోయేది. ఇంట్లోవాళ్ళు మోసుకొని వెళ్ళి మంచంమీద పడేసేవాళ్ళు. ఎంతోమంది డాక్టర్లకు, భూతవైద్యులకు చూపించారు. ఎన్నో రకాల పూజలు చేసారు, ప్రయోజనం లేకుండా పోయింది. సినిమాలకు వెళ్ళడం, రాత్రిపూట స్మశానంలో పడుకొని పొద్దున్నే ఇంటికి రావటం దినచర్యగా ఉండేది. భూతవైద్యుడు వచ్చినా, మంత్రాలు వేసేవాళ్ళు వచ్చినా నానా రభస చేసి, అందరినీ తన్నేది. నా దగ్గర మంత్రాలు, తంత్రాలా ? అంటూ వినండిరా సన్నాసుల్లారా అంటూ అన్నిరకాల దేవతా ప్రార్థనలు, మంత్రాలు చదివేది. మంత్రశాస్త్రంలో ఉద్ధండపండితులైన వారు కూడా ఆ మంత్రాలు చెప్పలేరు. అందరికీ చాలా ఆశ్చర్యంగానూ, అయోమయంగానూ, భయంగానూ ఉండేది. ఇంతలో బి.ఎ. ఫైనల్ ఇయర్ పరీక్షలు వచ్చాయి. ఈ అమ్మాయి సాధారణమైన స్టూడెంట్. బి.ఎ. ఫైనల్ ఇయర్ పరీక్షలు బ్రహ్మాండంగా వ్రాసి, కాలేజీ ఫస్ట్ వచ్చింది, పిచ్చి చేష్టలు, పూజలు, స్మశానంలో పడుకోవడం మాత్రం మానలేదు. ఓ రోజు రామసుబ్బారావు గారు మా గురువుగారి దగ్గరకు వచ్చి విషయం మొత్తం చెప్పారు. ఓ రోజు మా గురువుగారు వాళ్ళింటికి వెళ్ళారు. నట్టింట్లో ముగ్గు, కుంకుమ, సుమంగళి పసుపుతో ఓ బండిచక్రం లాంటి ముగ్గు వేశారు. కొన్ని మంత్రాలు చదివి, ఆ అమ్మాయిని ముగ్గులో కూర్చోబెట్టమన్నారు. బలవంతాన పదిమంది లాక్కుని వచ్చి ముగ్గు మధ్యలో కూర్చోబెట్టారు. నువ్వు ఎవరివి, ఎందుకొచ్చావు ? నీకు ఏం కావాలి ? అని గురువు గారు అడిగారు. నా పేరు పద్మజ, ఈ స్థలం నాది. నా సమాధి మీద ఇల్లు కట్టారు. నా స్థలం వదిలేసి వెళ్ళాలి, ఇల్లు ఖాళీ చేసి వెళ్ళిపోతే నువ్వు అమ్మాయిని వదిలేస్తావా ? అని అడిగారు గురువుగారు. లేదు. ఇల్లు పడగొట్టాలి అప్పుడే నేను వెళ్ళిపోతాను. అప్పుడు గురువుగారు అన్నారు, భేతాళుడి మీద ఒట్టా ! నిజంగా పోతావా!, భేతాళుడి మీద ఒట్టు వెళ్ళిపోతాను అంది. మా గురువుగారి సలహా మేరకు ఇల్లు పడగొట్టి వెళ్ళిపోయారు. ఇల్లు పడగొట్టడం ప్రారంభం కాగానే శ్యామల తీరు మారింది. ఏమీ తెలియనట్లు ఇల్లు ఎందుకు పడగొడుతున్నారమ్మా అని అడిగింది. అదంతా తర్వాత చెప్తాను, ముందు వెళ్దాం పద అని శ్యామలను తీసుకుని వాళ్ళ అమ్మానాన్న వేరే ఇంటికి వెళ్ళిపోయారు. అప్పటినుండి ఎలాంటి ఇబ్బందులు లేకుండా శ్యామల జీవితం హాయిగా కొనసాగింది.

## పరిహాసాలు - పలుకష్టాలు

**రవిగ్రహం మాంది అనే ఉపగ్రహంతో కలిస్తే చెడ్డ ఫలితాలు వస్తాయి. మానవాతీత శక్తుల వల్ల ఇబ్బందులు కలుగుతాయి.**

కొంతమంది దేవుడు లేదు, దయ్యం లేదు, ఆత్మలు లేవు, అన్నీ పుక్కిటి పురాణాలు. జ్యోతిష్యం శాస్త్రమే కాదు. గుళ్ళకు వెళ్ళడం దండగ. ఈ పూజలు పునస్కారాలు అన్నీ కొబ్బరికాయలు అమ్ముకున్నవాళ్ళకి లాభం తప్ప మనకేమీ ఉపయోగం లేదు అని వితండవాదనలు చేస్తూ ఉంటారు. ఎవరి నమ్మకాలు వాళ్ళవి, మతస్వేచ్ఛని రాజ్యాంగం ప్రసాదించింది, ఎవరి విశ్వాసాలు వాళ్ళవి, ఎదుటివాళ్ళని హేళన చేయటం, చులకనగా మాట్లాడటం సభ్యసమాజంలో స్వాగతించదగినది కాదు. ప్రకాశం జిల్లా ఒంగోలులో రామారావు, చంద్రశేఖర్, శివప్రసాద్, సుబ్రహ్మణ్యం నలుగురు స్నేహితులున్నారు. వీళ్ళు బాగా కలిసిమెలిసి తిరుగుతుంటారు. రామారావు, చంద్రశేఖర్ రవి మహర్దశలో ఉన్నారు, శివప్రసాద్‌కి రాహువు

మహర్దశలో రవి అంతర్దశ నడుస్తోంది, సుబ్రహ్మణ్యంకి శని మహర్దశలో రవి అంతర్దశ నడుస్తోంది. వీళ్ళు ప్రతివాళ్ళని హేళన చేసేవాళ్ళు. దేవుడు లేడని, దయ్యాలు లేవని వీళ్ళ నమ్మకం. వీళ్ళకి వాసుదేవరావు అనే మిత్రుడు ఉండేవాడు. అతనికో హోటలు ఉంది. ఆ హోటల్ పేరు సత్యనారాయణ విలాస్. ఓ రోజు మాటల సందర్భంలో దయ్యాల గురించి టాపిక్ వస్తే, వీళ్ళు నలుగురు దయ్యాలు లేవని అన్నారు. వాసుదేవరావు దయ్యాలు ఉన్నాయని గట్టిగా వాదించాడు. సరే ! దయ్యాలు లేవని నేను కూడా ఒప్పుకుంటాను. అయితే మీరు ఓ పని చేయాలి. స్మశానంలో సమాధుల మీద కూర్చొని రోజూ మీరు ఆడుకునే పేకాటనే అక్కడ ఆడుకుని పొద్దున్నే మీరు క్షేమంగా తిరిగివస్తే, భయపడకుండా ఉంటే అందరికీ తలా వందరూపాయలు ఇస్తానన్నాడు. వీళ్ళు సరేనన్నారు. నలుగురూ సైకిళ్ళు వేసుకుని రాత్రి ఏడున్నరకల్లా స్మశాన వాటికకు చేరుకున్నారు. వాసుదేవరావు అక్కడికి వచ్చి పదిగంటల నుండి మీరు పేకాట ప్రారంభించండి అని చెప్పి వెళ్ళిపోయాడు. వీళ్ళకు అసలు దయ్యాలు మీద నమ్మకం లేదు, భయపడేవాళ్ళు కాదు, పైగా ఒక్కొక్కరికి వందరూపాయలు వస్తున్నాయంటే అది చిన్న విషయం కాదు. చక్కగా ఫూల్‌గేమ్ ఆడుకుందామని నిశ్చయించుకున్నారు. చంద్రశేఖర్, శివప్రసాద్ ఒక సమాధి మీద కూర్చున్నారు. రామారావు, సుబ్రహ్మణ్యం ప్రక్కనున్న మరో సమాధి మీద కూర్చున్నారు. చొక్కాలిప్పుకున్నారు, చేతికి ఉన్న వాచీలు కూడా తీసి ప్రక్కన పెట్టారు. ఫూల్‌గేమ్‌లో ఎవరు గెలిచినా ఆ డబ్బులు తీసుకోకూడదు, ఎవరివి వాళ్ళకు ఇచ్చేయాలి అని ఒప్పందం చేసుకున్నారు. సైకిళ్ళు స్మశానం లోపలే పార్క్ చేశారు. కొవ్వొత్తి వెలిగించి నలుగురూ పేకాట ఆడుతున్నారు. గాలి లేకపోవడం వల్ల కొవ్వొత్తి నిలకడగా వెలుగుతుంది. వీళ్ళతోపాటు తెచ్చుకున్న ఫ్లాస్కులో ఉన్న టీ తలా ఒక కప్పు తాగారు. ఫూల్‌గేమ్ ఒక రౌండ్ పూర్తి అయ్యింది. రెండవ రౌండ్ ప్రారంభించారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో గంటలు కొట్టారు. మొత్తం 12 గంటలు. వీళ్ళు పేకాట కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. 12 గంటల 15 నిమిషాలకు వెనుక నుండి ఓ పొడవాటి నల్లని ఆకారం కనిపించింది. మనిషి కనబడటం లేదు. నోట్లో ఉన్న గంజాయి సిగరెట్టు, ఎర్రగా కాలుతూ కనబడింది. గంజాయి పొగ ఆ నల్లని ఆకారం చుట్టూ తిరుగుతుంది. ఎవడ్రా అక్కడ ? అని పెద్ద కేక వినిపించింది. వీళ్ళు నలుగురూ వెనక్కి తిరిగి చూసే సరికి ఎర్రగా కాలుతున్న ఆ గంజాయి సిగరెట్టు, పొగ, ఎర్రటి మిడిగుడ్లు కనబడ్డాయి. మనిషి ఆకారం మాత్రం కనబడలేదు. ఒక్కసారిగా భయభ్రాంతులయ్యారు. ఆ ఆకారం ఒక అడుగు ముందుకేసింది ఇక అంతే నలుగురూ కలిసి పరుగెత్తారు బయటకి, శక్తినంతా కూడదీసుకుని పరుగెత్తుతున్నారు. సైకిళ్ళు వదిలేసారు, ఫ్లాస్కు వదిలేసారు, వాచీలు, చొక్కాలు వదిలేసారు, పేకముక్కలు, డబ్బులు వదిలేసారు, ప్రాణం దక్కటమే ప్రధానమని శక్తికొద్ది పరుగెత్తుతున్నారు. వీళ్ళ పరుగులు చూసి చుట్టుప్రక్కల వాళ్ళు దొంగ దొంగ అని కేకలు పెట్టారు. దాంతో వీళ్ళకు పూర్తిగా ప్యాంటు తడిసిపోయింది. ఇంకా వేగంగా పరుగెత్తుతున్నారు. అలా పరుగెత్తి పరుగెత్తి ఆ చీకట్లో ఏమీ కనబడక ఒంగోలు మున్సిపాలిటి వాళ్ళు తవ్విన గొయ్యిలో పడ్డారు. దాంతో ఒళ్ళు హూనం అయ్యింది. గుండె దడ ఇంకా ఎక్కువైంది. అటుగా వస్తున్న బీట్ కానిస్టేబుల్స్ వీళ్ళని గోతిలో నుండి బయటకు

లాగారు. ఏమిట్రా అబ్బాయిలు ఏంటి సంగతి అని అడిగారు. వాళ్ళు రొప్పుతూ చెప్పలేక చెప్పలేక ఈ స్మశానంలో పేకాడే పందెం గురించి చెప్పారు.

ఎక్కడా చోటు లేనట్లు స్మశానంలో పేకాట ఆడుతార్రా ? అని లాఠీలతో నలుగురిని చితకబాదారు. వన్‌టౌన్ పోలీస్ లాకప్‌లో పెట్టారు. విషయం తెలుసుకున్న వాసుదేవరావు ఉదయాన్నే వచ్చి ఎస్.ఐ. గారితో మాట్లాడి పోలీస్ స్టేషన్ మర్యాదలు పూర్తి చేసి, వీళ్ళ నలుగురిని బయటకు తీసుకువచ్చాడు. నలుగురి ముఖంలోనూ నెత్తుటి చుక్క లేదు. నెలరోజులపాటు జ్వరం వచ్చినవాడు ఎలా ఉంటాడో అలా ఉన్నారు. ఒంటినిండా గాయాలు, వాసుదేవరావు వాళ్ళని సముదాయించి, పోదాము పదండి అని అన్నాడు. మా వాచీలు, సైకిళ్ళు స్మశానంలో ఉన్నాయని అని అన్నారు ఈ నలుగురు. అన్నీ నేను ఇంటికి చేర్పించాను పదండి పోదాము అన్నాడు. ఓ పదిరోజుల తరువాత అందరూ మామూలు మనుషులు అయ్యారు. ఎదుటివాళ్ళని అపహాస్యం చేసే పద్ధతులు మానుకున్నారు.

**అసలు విషయం :**

ఆ స్మశానంలో ఓ భైరాగి ఉన్నాడు. అతను స్నానం చేసి కొన్ని సంవత్సరాలు అయ్యింది. జడలు కట్టిన జుట్టు, ఒంటిమీద చినిగిపోయిన గుడ్డలు, గోళ్ళు ఒక్కోటి అరమీటరు వరకు పెరిగి ఉంటాయి. ఎర్రటి మిడిగుడ్లు, స్మశానంలో తింటాడు, స్మశానంలోనే పడుకుంటాడు. ఆ భైరాగి ప్రతిరోజూ ఉదయం అడుక్కునేవాడు, ఆ డబ్బులతో గంజాయి కొనుక్కొని తాగుతుండేవాడు. ఈ భైరాగికి అందరూ డబ్బులు ఇచ్చేవాళ్ళు. ఏదైనా బజారుకు అడుక్కోవడానికి వెళ్తే కాసిన్ని బియ్యం, ఒక రూపాయి ఇయ్యమ్మా, ఇవ్వాళ భేతాళుడికి స్మశానంలో పూజ చేయాలి, చితిమంటల్లో హోమం చేయాలి. కాస్త సాయం చెయ్యి తల్లి, పూజలో నీ పేరు కూడా చెప్తాలే, దాంతో వాళ్ళు కంగారుపడి పూజలో మా పేరు చెప్పద్దు బాబు, ఇదిగో నువ్వు అడిగిన బియ్యం, నువ్వు రూపాయి అడిగావు కదా రెండు రూపాయలు ఇస్తున్నాము, తీసుకుని వెళ్ళు బాబు అన్నారు. అతడు వెళ్ళిన వెంటనే తలుపులు వేసుకునేవారు. ఆ భైరాగి అవతారం చూస్తేనే అందరికీ వణుకు పుట్టేది. ఈ విధంగా రోజుకో బజారు వెళ్ళేవాడు. సాయంత్రానికి స్మశానానికి వచ్చి చితిమంటల మీద వంటచేసుకుని తినేవాడు. తరువాత గంజాయి సిగరెట్లు కాలుస్తూ పడుకునేవాడు. ఇతడిని చూసి చాలామంది పిల్లలకు దడుపు జ్వరాలు వచ్చాయి. కొంతమంది పోలీసు కంప్లైంట్ కూడా ఇచ్చారు. పోలీసులు భయపడి పెళ్ళాము బిడ్డలుగలవాళ్లము, వీడినెక్కడ అరెస్టు చేస్తాము ? మావల్ల కాదని తెగేసి చెప్పారు. స్మశానంలో ఈ నలుగురికీ కనబడిన ఆకారం ఈ భైరాగే. దయ్యాలు ఉన్నాయా ? లేవా ? అనే విషయం పక్కనపెడితే ఇది యథార్థంగా జరిగింది కాబట్టి మీ ముందుకు తీసుకువచ్చాను. ఏ మత విశ్వాసాలను కించపరచకూడదు, ఆధ్యాత్మికభావాలు కలిగిన వాళ్ళని ఎగతాళి చేయకూడదు. ఎవరి విశ్వాసాలు వాళ్ళవి. ఎవరి నమ్మకాలు వాళ్ళవి. **కొసమెరుపు ఏమిటంటే వీళ్ళు స్మశానంలో పేకాట పందెం పెట్టుకున్న రోజుకి పదిరోజుల ముందే ఆ భైరాగి చనిపోయాడు. అతడిని అదే స్మశానంలో సమాధి చేసారు.**

శంభోమహాదేవ

# సర్పదోషాలు

నళిని, శ్రీకాంత్ ఒకే కళాశాలలో చదువుకుంటున్నారు. ప్రేమించుకున్నారు. ఇలా చాలాకాలంగా ఇద్దరు కలిసి తిరుగుతున్నారు. పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఓ రోజు కాలేజీ క్యాంపస్‌లో శ్రీకాంత్ అనురాధ అనే అమ్మాయితో మాట్లాడుతున్నాడు. విషయం ఏమిటో తెలియదు గానీ శ్రీకాంత్ అనూరాధ పగలబడి నవ్వుతున్నారు. ఆ రోజు సాయంత్రం ఇద్దరూ హాస్టల్‌కి వెళ్తూ మాట్లాడుకుంటున్నారు. నళిని శ్రీకాంత్‌ను అడిగింది. అనూరాధతో అంత చనువుగా పగలబడి నవ్వుతున్నారు – అదేదో నాకు చెప్తే నేను నవ్వుతాను కదా – అన్నది నళిని. నళినిని ఆటపట్టించాలనే ఉద్దేశ్యంతో సరదాగా శ్రీకాంత్ చెప్పాడు. అనూరాధ నన్ను పెళ్ళికి ప్రపోజ్ చేసింది, నేను కూడా సరేనన్నాను, అదీ విషయం. నళిని హాస్టల్‌కి వెళ్ళి ఉరివేసుకుని చనిపోయింది. సూసైడ్ నోట్‌లో మరుజన్మలోనైనా నిన్ను పెళ్ళి చేసుకుంటాను శ్రీకాంత్ అని వ్రాసింది. ఇది ప్రచండ సర్పదోష ప్రభావం.

ప్రభాకర్ ఎం.బి.బి.ఎస్. పూర్తి చేశాడు. తరువాత ఐ.ఎ.ఎస్. ప్రిలిమినరీ పాస్ అయ్యాడు. టాప్ ఇంటలిజెంట్. ఎలాంటి చెడు అలవాట్లు లేవు. ఐ.ఎ.ఎస్. కోచింగ్ సెంటర్‌లో మోహిని అనే అమ్మాయిని ప్రేమించాడు. ఆ అమ్మాయి ఇతడిని ప్రేమించదు. ఇతను ఆ అమ్మాయి వెంటపడ్డాడు. రకరకాలుగా వేడుకున్నాడు ప్రేమించుమని. నువ్వు లేనిదే నేను బ్రతకలేనని చాలాసార్లు చెప్పాడు. రక్తంతో ప్రేమలేఖలు వ్రాశాడు. ఆ అమ్మాయి ఎంత ఛీత్కరించినా ఇతని పద్ధతిలో మార్పు లేదు. ఆ అమ్మాయి అన్నదమ్ములు తన్నారు, బంధువులు కూడా కొట్టారు. పోలీస్ కంప్లైంట్ ఇచ్చారు. పోలీసులు చావబాది లాకప్‌లో పడేశారు. అయినప్పటికీ అతని పద్ధతిలో మార్పు రాలేదు. సిగరెట్లు, మద్యం అలవాటయ్యింది. వన్‌సైడ్ లవ్ పనికిరాదని స్నేహితులు ఎంతగానో చెప్పారు. ఒక్కరోజు చదివితే నువ్వు ఐ.ఎ.ఎస్. పాస్ అవుతావురా, నీలాంటి టాప్ ఇంటలిజెంట్ నూటికో, కోటికో ఒకళ్ళుంటారు, మోహినిని మర్చిపో, నీ జీవితం బాగుంటుంది, నువ్వు కలెక్టర్ అయ్యావంటే ఇంతకంటే గొప్ప అందగత్తెలు నిన్ను పెళ్ళి చేసుకోవడానికి క్యూలో నిలబడతారు. ఇలాంటి మాటలు కూడా ప్రభాకర్ మీద పనిచేయలేదు. వాస్తవాలు మరిచిపోయి ఊహాలోకంలో ఉండిపోయాడు. జీవితం నాశనం అయ్యింది. ఇరువై ఐదు సంవత్సరాలు గడిచాయి. అయినా మోహిని మోహిని అంటూ కలవరిస్తున్నాడు. బంధువులు, ఇంట్లోవాళ్ళు అందరూ వదిలేశారు. ఇప్పటికీ స్మశానంలో కూర్చొని ఆ అమ్మాయిని వశపరుచుకోవడానికి క్షుద్రమంత్రాలు జపం చేస్తున్నాడు. స్మశానంలోనే తిరగటం, పడుకోవడం, జపాలు చేయడం వన్‌సైడ్ లవ్ వల్ల అతని జీవితం నాశనమై పోయింది. ఇది ప్రచండ కాలసర్పదోషం.

**ఎ)** భర్త మీద కోపంతో భార్య పిల్లలను చంపి, తాను చనిపోవడం.

**బి)** హైస్కూల్ క్లాస్ రూమ్‌లో నోట్స్ వ్రాసుకుంటు కూర్చున్నాడు ఓ కుర్రాడు. అతని పేరు శ్రీనివాస్, శ్రీకాకుళం జిల్లా. క్లాస్‌రూమ్‌లోకి పెద్దపాము వచ్చింది. ఇతనిని కాటేసింది తరువాత వెళ్ళిపోయింది. పాముకోసం ఎంత వెతికినా ఎవరికి కనబడలేదు.

**సి)** రవిబాబు ఈతలు కొట్టడంలో ఛాంపియన్. మారథాన్ స్విమింగ్‌లో ఆరితేరినవాడు. దేశవ్యాప్తంగా పేరుప్రఖ్యాతులు, అవార్డులు, రివార్డులు అందుకున్నవాడు. ఓ రోజు అందరితో ఈతకు వెళ్ళి నీళ్ళలో దూకాడు ఈదటానికి. నీళ్ళలో ఉన్న రాయి తలకి తగిలి అక్కడికక్కడే మరణించాడు. నీళ్ళ వలనే అతనికి పేరు వచ్చింది. చివరికి నీళ్ళ వల్లనే మరణం సంప్రాప్తించింది.

**డి)** జాతకంలో సర్పదోషం ఉన్నవాళ్ళకి పెళ్ళిళ్ళు కాకపోవడం, వివాహం అయిన తరువాత విడిపోవడం, అబార్షన్స్ కావడం, అంగవైకల్యం కలిగిన పిల్లలు పుట్టడం, సంతానానికి ఊబకాయం, మెదడు ఎదగకపోవడం, అంటే 15 సం॥రాల పిల్లవాడికి ఐదు సంవత్సరాల పిల్లలకు ఉండే మైండ్ మాత్రమే ఉంటుంది. కళ్ళు లేకుండా పుట్టడం, చెవులు వినపడకపోవడం, మాట్లాడలేకపోవడం, ఎప్పుడూ నిరుత్సాహంగా ఉండటం, చురుకుదనం ఉండదు. ఇతరుల పిల్లలలాగా ఆడుకోరు, గర్భసంచికి ఇన్ఫెక్షన్స్ సోకడం, పిల్లలు తల్లిదండ్రుల మాట వినకపోవడం, కోపంతో ఊగిపోవడం, సరిగ్గా చదువుకోరు, అన్నీ బ్యాక్‌లాగ్స్ ఉంటాయి, ఆడపిల్లలు కులాంతర, మతాంతర వివాహాలు చేసుకుని వెళ్ళిపోవడం, పిల్లలు చెడు స్నేహాలు పట్టి టూ వీలర్ కొనమని ప్రాణం తీయడం, అంతేగాక సర్పదోష తీవ్రతను బట్టి చేతికి వచ్చిన కొడుకు కానీ, కూతురు కానీ యుక్తవయస్సులో (చిన్న వయస్సులో) యాక్సిడెంటల్‌గా మరణించడం, ఆజన్మాంతం గర్భశోకంతో బాధపడటం, అనువంశికంగా రావల్సిన ఆస్తులు దక్కకపోవడం, భూములు, స్థలాలు చౌకగా అమ్ముకోవటం లేకపోతే వేరేవాళ్ళు ఆక్రమించుకోవడం, కబ్జా చేయడం, బహిష్టుకాక పోవడం, చర్మరోగాలు, చర్మం పెళుసుగా మారడం, సోరియాసిస్, హిస్టీరియా, చక్కగా చదువుకుంటున్నవాళ్ళు మంచి తెలివితేటలు కలిగినవాళ్ళు పరీక్షల్లో స్టేట్ ర్యాంక్ వస్తుందని నమ్మకం కలిగిన వాళ్ళు అనూహ్యంగా పరీక్ష తప్పటం జరుగుతుంది. చిన్నతనంలోనే తల్లిని కానీ తండ్రిని కానీ కోల్పోవడం ఇలాంటివి ఎన్నో చెడ్డఫలితాలు ప్రచండ సర్పదోషం వల్ల కలుగుతాయి.

**ఇ)** సైదయ్య లారీ క్లీనర్. మంచి దైవభక్తుడు. కష్టపడి పనిచేస్తాడు. డబ్బులు పొదుపు చేస్తాడు. జీవితంలో కష్టపడి పైకొచ్చాడు. బ్యాంక్ లోన్ తీసుకుని ఒక లారీ కూడా కొన్నాడు. తనే స్వంతంగా లారీ నడుపుకుంటూ నాలుగు లారీలు కొనే స్థాయికి ఎదిగాడు. వివాహం కూడా చేసుకున్నాడు. భార్య పేరు రమణి. ఇలా కాలం గడుస్తోంది. ఏ ఇబ్బందులు లేకుండా సైదయ్య జీవితం గడిచిపోతుంది. ఒకరోజు ముఖ్యమైన సరుకు డెలివరీ ఇవ్వాల్సి వచ్చింది. డ్రైవర్‌లకు అప్పజెప్పితే వాళ్ళు తాగి ఏం చేస్తారో అనే భయంతో తానే స్వయంగా లారీ నడుపుకుంటూ వెళ్తున్నాడు. పక్కన క్లీనర్ కూర్చున్నాడు. సరుకు భోపాల్‌కు చేర్చాలి. భోపాల్ ఇంకా 200 కి.మీ.ల దూరం ఉందనగా వర్షం పడటం ప్రారంభించింది. అయినా జాగ్రత్తగా లారీ నడుపుకుంటూ వెళ్తున్నాడు. ఇంతలో రోడ్డుకి మధ్యలో ఒకసర్పం పడగ ఎత్తి కూర్చుంది. పక్కనుండి వెళ్ళడానికి వీలు లేదు. పక్కనుండి వెళ్ళినా సర్పం అడ్డం వస్తుంది. లారీ ఆపి ఏం చెయ్యాలి అని ఆలోచిస్తున్నాడు. క్లీనర్ బండి పోనిచ్చెయ్ ఏమీకాదు అన్నాడు. సైదయ్య 20 నిమిషాలు బండి ఆపుకుని చూశాడు. అయినా పాము కదలలేదు. ఇక ఓర్పు నశించి లారీ పోనిచ్చాడు. భోపాల్‌లో సరుకు దించి ఇంటికి వచ్చాడు. ఆరునెలల తర్వాత భార్య గర్భవతి

**www.mulugu.com** చూడండి. ప్రతిరోజు ఉ॥ 8 గం॥లకు స్టార్ మా టీవీలో రాశిఫలాలు
కార్యక్రమం తప్పక చూడండి, కొన్ని విలువైన విషయాలు తెలుస్తాయి.

అయ్యింది. సరే భార్యకు తొమ్మిదవ నెల వచ్చింది, డెలివరీ అయ్యింది. ఇద్దరు మగపిల్లలు పుట్టారు. ఇద్దరికీ నడుములు లేవు. బండల మీద పాములాగా పాకుతున్నారు. ఎంతమంది డాక్టర్లకు చూపించినా ప్రయోజనం లేకపోయింది. తర్వాత భార్యకు అబార్షన్ అయ్యింది. తర్వాత మళ్ళీ గర్భం వచ్చింది కానీ మృతశిశువు జన్మించడం జరిగింది. దాంతో భార్యకు అనారోగ్యం వచ్చింది. మెంటల్ డిప్రెషన్ కూడా వచ్చింది. భార్యకు వైద్యం చేయిస్తున్నాడు. లారీ వ్యాపారంలో తీవ్రమైన నష్టాలు వస్తున్నాయి. ఒక్క లారీ మినహా మిగిలిన నాలుగు లారీలు అమ్మేశాడు. అధిక వడ్డీలకు అప్పులు తేవడం వలన అప్పుల వల్ల ఒత్తిడి తట్టుకోలేక ఉన్న ఒక్క లారీ అమ్మేశాడు. జీవనం గడవడం కష్టమవుతుంది. చేసేది లేక ఓ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలో లారీ క్లీనర్‌గా చేరాడు. ఆకాశం నుండి పాతాళానికి పడినట్ల అయింది అతని పరిస్థితి. ఇవి ప్రచండ సర్పదోషం వల్ల కలుగుతాయి.

## ప్రచండ సర్పదోషం

ఓ రోజు ఉదయం నేను మా ఇంట్లో కూర్చొని, టీవీలో వచ్చే సినిమా పాటలు వింటున్నాను. పాటలు అంతగా బాగా లేకపోవడంతో వేరే ఛానల్‌కి వెళ్ళాను. అందులో చిరంజీవి గారు నటించిన పున్నమినాగు సినిమా వస్తుంది. అందులో నాదస్వరం వస్తుంది, పాములు ఆడుతున్నాయి. సాధారణంగా ఏ సినిమాలోనైనా పాము కనబడినప్పుడు వచ్చే మ్యూజిక్ ఏదైతే ఉంటుందో అదే ఇక్కడ వినిపిస్తుంది. పాములాడటం, నాదస్వరం, చిరంజీవి గారు నటించడం ఇవన్నీ చూస్తున్నాను. మా పక్కింటి ఆవిడ పరుగెత్తుకుంటూ వచ్చి, ఆపండి బాబు, ఆపండి బాబు ముందు ఆ టీవీ ఆపండి అన్నది. ఏంటమ్మ ఏమిటి ? కంగారు పడుతున్నావు ముందు నా మాట వినండి, వెంటనే టీవీ ఆపేయండి, మీకు పుణ్యముంటుంది అని చేతులతో దబాదబా తలమీద కొట్టుకుంటుంది. నేను వెంటనే టీవీ ఆఫ్ చేసాను. ఆమె రొప్పుకుంటూ నా దగ్గరకు వచ్చి ఓ సారి మా ఇంటికి రండి అంది, సరేనని వెళ్ళాను. వాళ్ళ ఆయన కిందపడి మూర్ఛరోగిలా కొట్టుకుంటున్నాడు. ఈమె మొహాన నీళ్ళు చల్లింది, అలాగే ఓ పది నిమిషాలు నిలబడ్డాను. పదినిమిషాల తరువాత వాళ్ళ ఆయన లేచి రొప్పుకుంటూ వెళ్ళి కుర్చీలో కూర్చున్నాడు. అప్పుడు చెప్పింది ఆమె, ఆమె పేరు సుబ్బలక్ష్మమ్మగారు. మా ఆయన పాములకు సంబంధించిన నాదస్వరం వింటే కిందపడిపోయి కొట్టుకుంటాడండి, ఒళ్ళంతా కూడా నెలకు ఒకసారి పొట్టు రాలిపోతుంది, అది కూడా పాము కుబుసంలా ఉంటుంది. మీ ఇంట్లో నుండి వినబడ్డ నాదస్వరం విని కిందపడి కొట్టుకుంటున్నాడు, అందుకే నేను మీ దగ్గరకు వచ్చాను అంది. అప్పుడు విషయమంతా నాకు అర్థమైంది. కారణమేమిటా అని నేను ఆలోచిస్తున్న సమయంలోనే సుబ్బలక్ష్మమ్మగారే చెప్పారు. విజయవాడలో ఉన్నప్పుడు మావారు పాముని చంపారు ఆ తరువాత నుండి నాదస్వరం వింటే పడిపోవడం, ఒళ్ళంతా పాము కుబుసం లాగా వచ్చి చర్మమంతా ఊడిపోవడం జరుగుతుంది అని చెప్పింది. దీనినే ప్రచండ సర్పదోషం అంటారు.

www.mulugu.com చూడండి. ప్రతిరోజు ఉ॥ 8 గం॥లకు స్టార్ మా టీవీలో రాశిఫలాలు కార్యక్రమం తప్పక చూడండి, కొన్ని విలువైన విషయాలు తెలుస్తాయి.